కథానిక :

జలపాతం

సారిస్

కుర్తాళం excursion కి బయలుదేరాం, నేనూ నా కాలేజీ మిత్రులూ కలిసి ఆ నెల మే, అవడంచాత మాకు సులభంగా రెస్టుహౌస్ దొరికింది, ఒక పోక తోటలో.

మధ్యాహ్నం అలసట తీర్చుకుని, సాయంత్రం, జలపాతం చూడ్డానికని బయలుదేరాం.

పెద్ద కొండ పైనుంచి, నల్లని ఆకాశంలో కుపుతీగలాగ పడుతుంది ధార. కింద కటకటాల దగ్గిర, నలుగురాడవాళ్లు స్నానం చేస్తున్నారు.

"కొండమీద చాల మంచిచోటుంది చూపిస్తా"నన్నాడు షణ్ముగం.

సరేనన్నాం, కొండ ఎక్కుతున్నాం, చాల అందంగా వుంది సీనరీ. కిందినుంచి మంట పాలూ, గుళ్లూ చిన్నచిన్న ఇళ్లూ కనపడుతున్నాయి. వానకాలం జలపాతం ధార ఎక్కువయినప్పుడు వొస్తారట చాలమంది ఇక్కడ వుండడానికి.

ఏదో ఒక dream లో పడిపోయి నడుస్తున్నాను. ఝునఝునమనే శబ్దం చెవులకి వినపడి వులిక్కిపడ్డాను.

ఎదురుగుండా నల్లటి రాతిమీద చిన్న pools ఏర్పడి వున్నాయి. ఒక సన్నటి, రాతిసందులోంచి, ఆ pools లోకి నీళ్లు పడుతున్నాయి. ఆ pools లో నీళ్లన్నీ కలిసి కిందికిపారి, ఒక కొలను ఏర్పడింది. ఆ కొలనులో చాలమంది స్నానం చేస్తున్నారు.

"స్నానం చేద్దామా ?" అన్నాడు షరీ. అందరం బట్ట లిప్పి, బజారునించి తెచ్చిన చందన తైలం తలని అంటుకుని, నీళ్లలోకి దిగాం. ఎంత లోతువుందో తెలీదు ఆ కొలను. కొంతసేపు ఈతకొట్టి నీళ్లల్లో తేలి, బయటికొచ్చాం.

"చూశారా దైవమహిమ! తలతడివి చూడండి." అన్నాడు షరీ. జుట్టంతా వూడిపోయిందేమోనని బెదిరిపోయి తలలు తడిమి చూసుకున్నాం. నూనెజిడ్డే లేదు, తలంటిపోసుకున్న తలలాగు వుంది.

"నీళ్లల్లో మినరల్స్ వుండివుంటాయి." అన్నాడు రామ్మూర్తి.

"సినికల్‌గా మాట్లాడకోయ్ రామ్మూర్తి."

"సినిసిసమ్ కాదోయ్. అది సయిన్స్." అన్నాడు క్రిష్ణమూర్తి.

"గుడికి వెళ్దామా ? అన్నాడు షరీ.

"ఏంగుడి ?" అన్నాడు రామ్మూర్తి.

"కొండమీద షంభగాదేవి కోవెలుంది, తెలీదా ?"

"అమ్మో అదేం పేరు భయమేస్తోంది" అన్నాను.

షరీ బాధగాపెట్టాడు మొహాన్ని.

"భయమేమిటి ఎంత అందమయిన పేరో తెలుసా ?

"అందమా ?" నవ్వుతున్నాం తెలుగువాళ్ళమయిన మేము ముగ్గురం.

"ఆ పువ్వుల్నే మీరు చూస్తే—" అంటున్నాడు బాధగా షరీ,

"పువ్వులా ఏం పువ్వులు ?"

"శంభగపువ్వులు."

"అదేమిటోయ్. అవేంపువ్వులు మే మెప్పుడూ చూడలేదే ? అవి ఎంతంత వుంటాయేమిటి ? ఆ పేరునుపట్టి చూస్తే విసనకర్రలంత వుంటాయి అనుకుంటాను" అన్నాడు కృష్ణమూర్తి.

"శంభగపువ్వులని చూడలేదా ? అవిగో ఆమె తల్లో చూడండి." కొబ్బరిచిప్పలు పట్టుకుని, మానించి పక్క తొలిగిపోతున్న ఒక వనిత తల వేపు చూపించాడు.

"అవా ? చంపక పూలుకి వొచ్చిన తిప్పలా ఇది. ఏంభావ బాబూ మీది. సంస్కృతంలో వున్న అందాన్నంతా ధ్వంసం చేసేసారోయ్" అన్నాడు రామ్మూర్తి. "సరే, గుడికి వెళ్దామా" అన్నాడు మేము ఎంత ఆటలు పట్టించినా, ఏడిపించినా, కోపం తెచ్చుకోని షరీ. ఒక ఇద్దరు క్రిష్టియన్ యువతులు చిన్న టబ్బుల్లాగవున్న (Pools) లో పడుకుని పకపకమని నవ్వుకుంటూ మళయాళంలో మాట్లాడుకుంటూ స్నానం చేస్తున్నారు. మే మక్కడ వున్నామనే ధ్యాస లేకుండా "అరే, నేను కదలలేనురా" అన్నాడు మూర్తి జలసుందరులను చూస్తూ కూలపడి.

"దేవి దర్శనం చేసుకుంటే కాశీకి వెళ్లినంత పుణ్యం కలుగుతుంది" అన్నాడు భక్తిపరుడు షన్.

"ఆ దేవి సంగతి ఏమోకాని, ప్రస్తుతం ఈ దేవీల దర్శన ప్రభావం నన్ను అమాంతం కైలాసానికి ఎత్తినంత ఆనందంగా వుంది అన్నాడు. Adventurer క్రిష్ణమూర్తి. "నీ పెళ్లామే ఇక్కడ వుంటే కైలాసంమాట అటుంచి ముందు పాతాళానికి తొక్కిపడేవాడివి" అన్నాడు రామ్మూర్తి

ఆ విశ్వసౌందర్యంలో పరవశం చెందుతున్న నాకు, వాళ్ల జోక్స్, మాటలు, ఏమీ వినపడటంలేదు. ఎప్పుడూ కలగని, మనస్సుని కలవరపెట్టే భావాలు స్ఫురించాయి నాకు.

"గుడికి వెళ్దాం" అన్నాను అప్రయత్నంగా.

"చూశారా, మన ప్రాఫెట్‌గూడా వెళ్దామంటున్నాడు ? అన్నాడు షన్. నేను హాస్టల్లో అందరికీ జాతకాలు చెప్పడం, ఫిలాసఫీ, సయిన్సు ఎక్కువగా discuss చేస్తూవుండడం వలన నా క్లాస్‌మేట్స్, నన్ను ప్రాఫెటని పిలుస్తారు.

అందరం బయలుదేరాం. ఎదురుగుండా కొబ్బరి చిప్పలు పట్టుకుని ఆడవాళ్లూ, మొగవాళ్లూ, పిల్లలూ, వొస్తున్నారు అమ్మవారిని దర్శించుకుని ఎక్కాం, ఎక్కాం ఎంతకీ రాదు గుడి సాయంకాలపు ఎండలో స్ఫటికపు రాళ్లు మెరుస్తున్నాయి.

చుట్టూ ఆకాశం కనపడకుండా, పెద్ద పర్వతం, పాములాగు మెలికలు తిరుగుతోంది మాముందు చీలుదారి. జలపాతం కంటికి కనపడకపోయినా ధ్వనిమాత్రం వినపడుతోంది పూసెరిపిల్చి నప్పుడల్లా హృదయం కొండగడ్డి సువాసనతో నిండి వుత్సాహం కలగచేస్తోంది.

ఆ atmosphere లో వున్న magnetic శక్తి నన్ను వశపరచుకుని మత్తెక్కించింది. స్వప్నములో లాగ నడుస్తున్నాను.

ఎదురుగుండా నాలుగు చెట్లూ, ఒక గోపురమూ కనపడ్డాయి. నా మత్తుని దులుపుకొని చురుకుగా నడిచాను.

"ఇంత ప్రశాంతంగా వుంటుంది కనుకనే యోగులు కొండలూ, అడవులు పడతారు". అన్నాడు రామ్మూర్తి.

గుడిదగ్గిరకు వొచ్చాం. ఆప్రదేశమంతా పదిగజాల విస్తీర్ణముంటుంది.

అంచున, మాయమయిన జలపాతం మళ్లీ ప్రత్యక్షమయింది. గుడి లోపలికి వెళ్లాం. వెంట తీసుకువొచ్చిన కొబ్బరికాయ పూజారి కిచ్చాడు షరీ.

"మీ ద్రావిడులకి ఎంత ఆర్టు వుందోయ్. ఈ మాటే మా ఆంధ్రులముందర అంటే వెంటనే, వురిపోసుకుంటారు." అన్నాడు రామ్మూర్తి గుడిమంటపంచుట్టూ తోరణాలుగాకట్టిన, చంపకపువ్వులనీ, మొగలి రేకుల్నీ ప్రమిదలు అమర్చిన విధానాన్ని చూసి తన్మయుడవుతూ.

"అంధు లెవరు ?"

"అదే. మావాళ్లు. ఆంధ్రా ఆర్టిస్ట్స్ మని గెంతుతారే వాళ్లు."

"దేవిని చూద్దాం లోపలికి రండి." అన్నాడు. షరీ.

గుడి సువాసన అంటే నాకు ఎంతో ఇష్టం. నూనె, సాంబ్రాణి, అగరు, గంధం, కర్పూరం, కుంకుమ, వాసన్లన్నీ కలిసి ఒక విధమయిన పరిమళం తయారవుతుంది. దేవుడు లేడు, ఒకవేళ వుంటే, వుత్త తెలివితక్కువ దద్దమ్మ. గుళ్లూ, అభిషేకాలూ, పూజార్లూ, ప్రజల్ని మోసపుచ్చి, డబ్బులాగే విధానాలు అని ఎంత వాదించినా, గుడికి వెళ్లగానే, గుడి సువాసన తగలంగానే ఒక భంధ మేర్పడుతుంది. ఎక్కడాలేని భక్తి ప్రేమా కలుగుతాయి. ఎప్పుడూ అక్కడ పెరిగినట్టు, నా స్వంతమనిపిస్తుంది. ఎంత 'గెజెల్' అయినా ఆ ఫీలింగ్ వొదలదు. ఎంత విడిపించుకోవాలన్నా, పూర్వులు మన మెడకి వేసిన బంధం వొదుల్చుకోగలమా !

వొదుల్చుకున్నామని మోసపోయి చెలరేగుతాం, జయభేరిలు మోగిస్తాం. ఏమీ అడ్డాలు లేకుండా కనపడ్తుంది ఆకాశం. రెక్కలు తగిలిస్తాం, ఎగరడానికి ప్రయత్నిస్తాం. ఎగురుతున్నామనుకుంటాం. మనకళ్లు మూతలుపడతాయి. అంతే! కళ్లు తెరిచిచూస్తే చివరికి ఎవరు మనని తాడుతో, ఒక గుంజకి బంధించారో, అక్కడే ఆ గుంజచుట్టూరా తిరుగుతూవుంటాం.

పూజారి గంట మోగిస్తూ హారతిస్తున్నాడు అమ్మవారికి. హారతి వెలుగులో జిగజిగమని మెరుస్తున్నాయి. మెడలో ఆభరణాలు. నునుపైన నల్లటి వొంటిమీద ఎర్రని చీర, వెండికళ్లు, చూడడానికి భీకరంగావుంది.

పూజారి కొబ్బరి చిప్ప యిచ్చాడు. నుదిటిమీద విభూది, కుంకుమ, పెట్టుకుని, బయల్దేరాం వెనక్కి.

మళ్లీజలపాతం దగ్గిరికి వెళ్లి కూచున్నాం. మాపక్కనే ఒక అంగుళం ఎత్తున నీళ్లు నిలిచి వున్నాయి. ఈ నీళ్లే కింద కొలనులోకి ప్రవహిస్తాయి. నాకు దాహమేసి, మెల్లిగా నీళ్లలోకి దిగాను.

"భద్రం, ప్రాఫెట్, సొరంగాలున్నాయి అడుగున. జాగ్రత్త" అన్నాడు షరీ."

"నాన్సెన్స్, లోతే లేదు." అని ఇంకా లోపలికి పోతున్నాను."

"చూపించనా ?" ఒక కర్ర తీసుకుని ఒక చోట నీళ్లల్లో ముంచాడు. కర్రంతా మణిగిపోయింది. వొణుకుతో వెనక్కి, వొచ్చాను.

"అరే, చాల తమాషగా వుంది." అన్నాడు క్రిష్ణమూర్తి.

"ఏమనుకున్నావు ? ఒక్కొక్క సొరంగం ఎంత లోతువుందో ఎవరికీ తెలీదు". అన్నాడు షరీ.

"అంతా సెలలాగవుండి అక్కడక్కడ ఇట్లా సొరంగాలుండడం చాల ప్రమాదమే." అన్నాను.

"మన మేమనడానికీ వీల్లేదు. సృష్టి అట్లా నిర్ణయించింది" అన్నాడు రామ్మూర్తి.

"కాదు." అన్నాడుషరీ, అందరం అతనివొంక చూశాం.

"కాదు యాభయివందల స్సంవత్సరాల కిందట ఈ సొరంగాలు లేవు."

"యాభయివందల సంవత్సరాల కిందట వున్నాయో లేవో ఎవరికి తెలుసు. మనం చూశామా ?" అన్నాడు రామ్మూర్తి.

"ఈ చుట్టుపక్కల ఎవర్నడిగినా చెపుతారు ఈ కథ మీకు. యాభయివందల సంవత్సరాల కిందట కింద కొండపక్కనే ఒక ఆశ్రమంలో ఒక యోగీంద్రుడుండేవాడుట. ఆయనని కనిపెట్టుకుని ఒక వెధవామె వుండేది. ఆమెకి ఒక కూతురు. ఆ అమ్మాయే శంభగ" అన్నాడు సీరియస్‌గా షన్.

"ఏమిటి ? పైనున్న అమ్మవారా ?" అన్నాను.

"అవును, అప్పుడామెకి పదమూడేళ్లు. యోగీంద్రుడి సలహామీద తల్లి, కూతురికి పెళ్లి చెయ్యాలనే తొందర మానుకుంది.

శంభగ రోజా తోటలో పువ్వులుకోసి దండలు కట్టేది. వూళ్లో అందరిళ్లకీ వెళ్లి పాటలు పాడి, కబుర్లు చెప్పి వస్తూవుండేది.

వూళ్లో అందరికీ ఆమె అంటే అమితమయిన ప్రేమ. అందులో యోగీంద్రుడు, ఆమె చాల గొప్పదని చెప్పడంవల్ల అందరికీ ఆమెని చూస్తే కొంచెం భక్తికూడాను.

యోగీంద్రుడి శిష్యులలో, చిన్నప్పణ్ణించి ఆశ్రమంలోనే పెరుగుతున్న కుర్రాడికీ, శంభగకీ చాలా స్నేహం. ఒకరు ఒక నిమిషం కనపడకపోతే ఇంకొకరు నిలవలేకపోయేవారు !

"ఏమోయ్; షరీ, చంపక అనవోయ్." అన్నాడు రామ్మూర్తి ఇబ్బందిగా. రోజూ చంపా, ప్రభాకర్, ఇక్కడికొచ్చి నీళ్ళు తీసికెళ్ళేవారు ఆశ్రమానికి.

ఒకరోజు చంపా, ప్రభాకర్, నీళ్లకి వొచ్చి, ఆడుకుంటున్నారు.

"ప్రభా, అవతలివేపునవున్న రాయిమీది ఎక్కుదామా ?"

ఇద్దరూ, ఈ నీళ్లని దాటి, అవతలి గట్టు కెళ్లి, ఆడుకుని, తిరిగివొస్తున్నారు. ఇంతలో చంప. "ప్రభా మణిగిపోతున్నాను పట్టుకో." అని అరిచింది. ప్రభాకర్ వెనక్కితిరిగి చూశాడు, నీళ్లలో చంప రెండుచేతులూ కనపడుతున్నాయి.

నీళ్ల అడుగునించి భూమి బద్దలయి విరిపోతున్నట్టు పెద్దశబ్దం. ప్రభాకర్‌కి భయమేసి, బిగ్గరగా అరిచాడట. ఆమెచేతులు పట్టుకు పయికి లాగాలని ప్రయత్నించాడు. కానీ కుర్రాడు ఏం లాగగలడు.? అతని చేతుల్లోంచి జావలాగ జారిపోయింది.

ప్రభాకర్ కేకలకి చుట్టుపక్కలవాళ్లు పరిగెత్తుకుంటూ వొచ్చారు.

ఏం లాభం ? చంప అప్పటికే ఎన్ని మైళ్లు లోతుకి వెళ్లిపోయిందో !

లోతులేని ఈనీళ్లలో ఎట్లా మణిగిందా, అని ఆశ్చర్యంతో నీళ్లల్లో వెతికారు. అక్కడక్కడ గంగాళం వెడల్పు సొరంగాలు ఏర్పడి వున్నాయిట.

కూతురునీళ్లలో మణిగిపోయిందన్న వార్త వినగానే, తల్లిగుండె బాదుకుని ఏడ్చిందిట. ఆమెతోపాటూ వూరి వారందరూ చింతించారు.

అందరూ యోగీంద్రుణ్ని ముట్టడించారు.

"బంగారంలాంటి పిల్లని ఎందుకు మునగనిచ్చావు? నీకే మాహాత్మ్యముంటే తిరిగి బతికించు" అని గోలచేశారు. అప్పుడు యోగి.

"ఈశ్వరి ఈ రూపంలో పుట్టింది మిమ్మల్ని ఉద్ధరించడానికి. మనుష్యరూపంలో, శక్తిచాలక అవతారం చాలించి, దేవిగా వెలిసింది కొండమీద." అని చెప్పాడు అందరికీ. ఆ వెలిసిన చోటున గుడికట్టించారామెకి." అన్నాడుషరీ,

"రాట్ !" అన్నాడు రామ్మూర్తి.

"నిదర్శనం చూపితే, ఏమిస్తావు ?"అన్నాడు షరీ.

కొంతసేపయింది. అంతా నిశ్శబ్దం.

తిరిగి చూశాను ఎవరూ లేరు. షణ్ముఖం, రామమూర్తి, క్రిష్ణమూర్తి, అందరూ మాయమయినారు. చీకటిపడుతూంది. ఒక్కణ్ణీ ఆ గట్టుమీద కూచుని ఎదురుగుండా వున్న నీళ్లని చూస్తున్నాను. ఇంతలో గుప్పుమని అగరువాసన, వెంటనే చంపకపువ్వుల వాసన వేసింది. తలెత్తి చూశాను. ఒక తెల్లని వ్యక్తి, అవతలి గట్టున రాయిమీద నుంచుని వుంది.

"ప్రభా, ప్రభా, నువ్వేనా ?" ఎవరనుకుందో నన్ను చూసి ! ఆ మసక చీకట్లో ఆమె మొహం స్పష్టంగా కనబడటం లేదు.

చేతులు జాచింది. "ప్రభా, మునిగిపోతున్నాను, పట్టుకో." అని కలకలమంటూ నవ్వుతూ నా వేపు నడిచి వొచ్చింది. ఆమె దగ్గరికొచ్చిన కొద్దీ, ఒక పెద్దశక్తి నన్ను ఆవరించింది.

"ప్రభా, చూడు నీకోసం, అతి ప్రయాస మీద వొచ్చాను ఈ రూపంలో. చూడు నా పాదాలు, అలవాటులేక ఎట్లా కొట్టుకుపోయాయో !" నా పక్కనే కూచుని చూపిస్తోంది. అప్పుడే పుట్టిన పసిపాప చేతుల్లాగు, పాదాల్లాగు వున్నాయి ఆమె తెల్లని పాదాలూ, చేతులూ. అప్పుడే గూటిలోంచి, బయటపడి, రెక్కలని ఎట్లా వుపయోగించుకోవాలో తెలీక, లోకాన్ని కొత్త దృష్టితో చూస్తూ, సంతోషంతో ఎగిరే శిశువు కోక చిలుక గుర్తు కొచ్చింది, ఆమె అల్లాడే కళ్లనీ, చిరునవ్వుతో వొణికే పెదిమలనీ, కదిలే చేతివేళ్లనీ చూస్తే.

"ఎవరు మీరు ? ఎట్లా వొచ్చారు ? నన్ను ఎవరనుకుంటున్నారు? నా పేరు ప్రభ కాదు శంకర్రావు."

నమ్మలేనట్టు చూసింది నావంక బెదురు కళ్లతో.

ఆ మసకచీకట్లో చెట్లు నీడల్లా గున్నాయి. నల్లగా భీకరంగా వుంది కొండ. ఆరాతిమీద మే మిద్దరం. లోపల్నించి వొణుకుపుట్టింది నాకు,

(17 వ పేజీ చూడుడు)

జలపాతం

(11 వ పేజీ తరువాయి)

"ప్రభా, ప్రభా, నన్ను మర్చిపోయినావా అప్పుడే! నీ చంపని నన్ను! ఎన్నియేళ్లనుంచి నీ కోసం నా తపస్సు. ఇప్పటికి, ఇన్ని జన్మాలకి, నన్ను శిలగా మార్చిన శక్తికి, నామీద కరుణ కలిగింది ఈరాత్రి. ఇన్ని సంవత్సరాలూ, 'నా రూపం, నా ఆత్మ, నా హృదయం, పాషాణంలో బంధింపబడింది ఏశాపంవల్లనో, ఏకారణంవల్లనో. అందరూ పూజించారు, ఆరాధించారు నన్నుకాదు, నా రూపంలో వున్న శిలా విగ్రహాన్ని.

నిన్ను చూడాలనీ, నిన్ను కలుసుకోవాలనీ, నా ప్రయత్నాలన్నీ వ్యర్థమయినాయి.

ఆరోజు నువ్వు నీ కొత్త వధువుతో స్థాపాణదేవతి దీవనకు, మొక్కడానికి వచ్చినపుడు, నీ వధువు కొత్త సిగ్గు నా గుండెలో భగ్గుమంది. నీ పట్ల ఆమె వాలుచూపులు నా నరాల్ని పీడించి వేధించాయి. నా హృదయంలోంచి చీల్చుకుని, చింపుకుంటున్న ఆర్తనాదం, శిలలో గడ్డకట్టుకుపోయింది.

నా శక్తి అంతటితో, నా బలమంతటితో పెనుగులాడాను.

"ప్రభా, ప్రభా, అప్పుడే మర్చిపోయావా నన్ను! ఒక్కసారి నావంక చూడు" అని గొంతు చించుకుని అరిచాను. ఎక్కడో దూరంనించి లాగు వినపడిందిగావును నా పిలుపు, ఒక్కసారి తలఎత్తి చూశావు నావంక. ఆ జీవంలేని బెండికళ్లల్లోకి గౌరవంతో, భక్తితో, వినయంతో ఒక్కక్షణం నీ కొత్త సంతోషంనించి ధ్యాస మరల్చి, తరవాత ఆ రూపంలో, ఆ జన్మలో చాలసార్లు చూశాను. జ్ఞాపకం లేదా నీకు!" నా కళ్లల్లోకి తన స్మృతు లన్నిటినీ తన కళ్లలోంచి ప్రవేశింపచేయాలనే ఆమె ప్రయత్నం నన్ను ఆమె ఆత్మబంధువుని చేసింది.

నిజమా, కలా అని ఆమె వొణుకుతున్న చేతుల్ని ముట్టుకున్నాను. పరవశమయి, కళ్లు సగం వాల్చి నవ్వింది.

"ఈ స్పర్శ, నీచేతి స్పర్శ! యాభయివందల సంవత్సరాల తపః ఫలితం." నాచేతి స్పర్శ, యాభయివందల సంవత్సరాల తపఃఫలితం! ఏ స్త్రీ అయినా, యింతవరకు ఏ పురుషుడితో నయినా అనివుంటుందా అని నా ఆశ్చర్యం, నా గర్వం.

నిజంగా నాలో అంత విలువ వుందా, లేక ఆమె హృదయసామ్రాజ్యంలో కట్టుకున్న ఆరాధనా విలయమా?

"నా దేవీ, ఈవాత్సల్యం అనాదినుంచీ నేను చేసుకున్న పుణ్యఫలితం, నే ననర్హుణ్ని మీ దయకీ, మీ ప్రేమకీ. మీరు నన్నెవరనో పొరపడుతున్నారు. నాకు ఏ స్మృతులు స్మరణకి రావటంలేదు. నేను చాల సామాన్యుణ్ని." అన్నాను. ఆమె తేజం ముందు నా అల్పత్వంలో ముడుచుకుపోతూ.

ఆమె గొప్ప గంభీరంతో నిండింది. కంఠంలో పెద్దబాధ.

"పొరపాటా? సకల జనులూ దేవతగా ఆరాధించుతున్న నేను, నా భక్తులకి సమస్తమయిన వరాలు సంకల్పించే నేను, నీజీవన్మరణాలనీ, నీ కొత్తజన్మలనీ, పరిశీలిస్తూ, నీజీవితాన్ని ప్రతిక్షణమూ ఏ ఆపదలూ, ఏ ఆటంకాలూ, కలుగకుండా కాపాడుతున్న నీలో పొరపాటా? పిచ్చివాడివి. ఔను వుత్తపిచ్చివాడివి. ఆరోజు నీభార్య పోయినరోజు, నాపాదాలమీద పడి కన్నీళ్లు కార్చావు. తిరిగి బతికించమని ప్రాధేయపడ్డావు. నాచేతుల్లోకి తీసుకుని ఓదార్చాలనీ, నాప్రేమమాధుర్యంతో నర్వమూ మరిపించాలనీ, నాప్రయత్నం, నాప్రయాస అర్థ మయిందా నీకు? యిప్పుడు అర్థమవుతుందా?" ఆమెప్రశ్నకి జవాబు చెప్పలేక తల వొంచుకున్నాను.

"తరవాత చిన్న లేడి పిల్లయి, నా ఆలయం చుట్టూ తిరుగుతున్నప్పుడు నీ కందని కొమ్మలని వొంచి, ఆకులన్నిటినీ, నీచేత తినిపించి, ఆ పచ్చని గడ్డిలో నీతో గంతులేసి, ఆడుకోవాలని ఎంత అనిపించేది.

నా కళ్లముందే ఆ అమావాస్య రాత్రి ఆకలిగొన్న ఒక ఆడుపులి నా మీదికి వురికింది. పాషాణ విగ్రహంలోంచి, నా హృదయంలోకి చీల్చుకు పోయింది నీ మరణవేదన.

తరవాత పావురమయి, నా ఆలయంలో గూడు కట్టుకున్నావు.

ఆతరువాత రావిచెట్టు వయి, నా ఆలయానికి శీతలమయిన నీడ కల్పించావు ఎన్నో సంవత్సరాలు ఈ నాటికి మళ్లీ మానవజన్మ ఎత్తిగానే, నాలో ఎన్నో ఆశలు మొలకెత్తాయి ఇప్పటికయినా నిన్ను మళ్లీ కలుసుకోలేనా అని. నా శక్తితో, నా తపోబలంతో, యీ రూపం తెచ్చుకున్నాను నీ కోసం, నీకోసం!

నన్ను మర్చిపోయిన నీకోసం. రా, దగ్గిరిగా రా, కొత్త ఆనందాలకీ, కొత్త వెలుగుకీ, నాలో అనంతంగా యుగయుగాలు రగిలి, జ్వలిస్తున్న ప్రేమతేజస్సుకి నీ కళ్లు తెరస్తాను. మేలుకో! మేలుకో!" నా గుండెమీద చెయ్యివేసింది. నా దేహం పెద్ద విద్యుచ్ఛక్తితో భగ్గుమని రగిలింది. నా కళ్ళముందు గొప్ప వెలుగు వెలిగింది. ఆనందముతో ఆ మెరూపం రకరకాలుగా, రంగురంగులలో నృత్యం చేసింది మధురమయిన నాదస్వరం చెవులకి వినపడుతోంది

కళ్లు తెరిచాను అతిప్రయత్నంతో. పడమట కుంకుతున్న సూర్యుడి కిరణాలు కొలనులో నీళ్లని బంగారంగా మార్చాయి.
దూరంగా వూళ్లోనించి మధురమయిన సన్నాయి మేళం.

"ఏమిటి కలా? నిజ మనుకున్నాను అంత సేపూ" అన్నాను బిగ్గిరగా. ఆశ్చర్యంతో నా ముగ్గురు మిత్రులూ నావంక చూశారు.

"కలకూడా వొచ్చిందన్నమాట ఆకాస్త కునుకుకీ" అన్నాడు క్రిష్ణమూర్తి

"ఏమిటి కాస్తసేపా! ఒక యుగంలాగ వుంది నాకు."

"దేవీమాహాత్మ్యం." అన్నాడు పక్.

"ఏమి టాకల! మనం చూసిన జలసుందరుల మీదా?" అన్నాడు రామ్మూర్తి.

"చెప్పవోయ్." అన్నాడు కృష్ణమూర్తి కుతూహలంతో.

"ఎట్లా చెప్పను!"

"ఏం, చెప్పడానికి వీలులేనిదా?" అన్నారు మూర్తు లిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని.

"నాకు వొచ్చినా బావుండును." అన్నాడు కృష్ణమూర్తి

"వేళాకోళం చెయ్యకండి. ప్రాఫెట్ ఏదో గొప్ప అనుభవం మనకు తెలీనిదీ, అందుకోలేనిదీ అనుభవించాడు స్వప్నావస్థలో. అతని కళ్లు చూడండి ఎట్లా మెరుస్తున్నాయో!" అన్నాడు పక్. ఇద్దరుమూర్తులూ నాకేసి చూశారు. వారి ముఖాలలో హాస్యం మాయమయి, ఆశ్చర్యం వింతా.

"నాకు చెపుతావా నీ కల?" చెప్పాను. శ్రద్ధతో, ఆశ్చర్యంతో విన్నారు.

"అదే, సదర్శనం, నాకథలో నిజానికి." అన్నాడు పక్.

మహాత్మాగాంధీ సందేశం

(16-వ పేజీ తరవాయి)

"నాకు, 'సాధన', 'ఫలితము' వీటి రెంటి స్వరూపము ఒకట్టిగానే గోచరిస్తుంది. అసత్య సాధనతో, సత్యఫలితాలను ఏనాడూ పొందలేము" అని అన్నాడు.

ఈ సాధనను, అంతర్బహిరుపాధుల రెంటి వల్లనూ సాధించవలె నని గాంధీజీ అనుకొనే వాడు. తన్ను తను జయించలేనిదే, "భారత జాతికి" 'జయం' చేకూర్చటానికి నాయకుడనై నడిపించలే ననే అనుకొనేవాడు.

స్థిరచిత్తం కావాలంటే, సంగపరిత్యాగం కావాలని, స్థిరచిత్తం లేనిదే, "సత్యము" చిక్కదనీ ముందే గ్రహించాడు. తన ఆహార విహార వ్యవహారాల నన్నిటిని నియమితమొనర్చుకున్నాడు. ఆహారనియమం పాలించాడు. మత్తు పదార్థాలను తననుండి దూరం చేసుకొన్నాడు. 'తనది' అని ఏదీ ఉంచుకోకుండా జాగ్రత్త పడ్డాడు. బ్రహ్మచర్యాది అనేక నియమాలు అవలంబించాడు.

"కుత్సితుడా! నీదృష్టిలోని స్థూలఅవరోధాన్ని ముందు తొలగించుకో. నీ సోదరుని కంటిలోని చిన్ని నలుసును అప్పుడే తొలగించుకోగలవు" (బైబిలు).

గాంధీజీ తన కంటిలోని స్థూలఅవరోధాలను తొలగించుకోగలిగానని ఏనాడూ చెప్పుకోలేదు. తనను "మహాత్ముడ"నని ఏనాడూ ప్వకోలేదు. అతని సోదరమానవులే ఆ మహాత్వాన్ని గుర్తించి, ఆయనకు మహాధికారశక్తిని అంకితం చేశారు. తన కా అధికార ముందని కూడా ఏనాడూ ఆయన అనుకోలేదు.

గాంధీజీ బోధలలోనూ, రచనలోనూ, ఎక్కడా అబద్ధాలు కనబడవు. నైచ్యము, పరనింద, సంకుచితత్వము, కుత్సితత్వము, భయము, దుర్గర్వము, దంభము, ద్వేషము, దురభిమానము కనబడవు. "ఇది ఇంతే తిరుగులేదు" అని చెప్పిన దెక్కడా ఉండదు.

ఆయనలో అంతర్వాణి—భగవంతుడంటే, సర్వాంతర్యామియై అనిర్వచనీయ మైన ఒకమహాశక్తి, ఆయన భావించాడు—ఆ అంతర్వాణి, అతివినయంతో, మృదులంగా సర్వదా పలుకుతూ ఉండేది. ఆయనలోని ఆ స్వచ్ఛతాదర్పణంలో, ఇతరులలోని సత్యము ప్రకాశించి, ప్రతిఫలించి, పెరిగి పెద్దదై మహాజ్యోతిగా కనబడేది. మహోజ్జ్వలమైన ఫలితాలను సాధించేందుకు ప్రేమపథాన్ని, అవలంబించటంలో "బోధిసత్వుని" అనుకరించాడు.

"సత్యమునే వచించు. ఆగ్రహాన్ని ప్రేమతో జయించాలి అసత్యవాదిని సత్యముతో లొంగదీసుకురావాలి" అని బుద్ధుడు చెప్పాడు.

లోకాన్ని పరిత్యజించి, ఆత్మోపలబ్ధికై, నిర్జనప్రదేశాలలో ముక్కుమూసికొని కూర్చున్న చాలామంది సన్యాసులవలెగాక, బుద్ధునివలెనే, గాంధీకూడా, మానవలోకం నుండి మానవుని విముక్తుని చేయటానికి ప్రయత్నించాడు. ఆయనను యోగి అని, పిచ్చివేదాంతవాది అని వెక్కిరిస్తూ అపార్థాలు చేసుకోటం పాశ్చాత్య లోకంలో పరిపాటి అయిపోయింది. కాని "స్వధర్మ" (*Religion*) మానవమైన రాజకీయాలువయుపతత్వంవైపుకే మొగ్గిచ్చాడు. ఏమీ అర్థం లేనివిగా నాకు గోచరిస్తాయని ఆయన అన్నాడు. ఆ ధర్మసూత్ర పూర్వాపరాలను సాకల్యంగా, ప్రత్యక్ష ఆచరణప్రయోగము వల్ల సాధించి చూపించాడు. ఆయన యథార్థ సంఘసంస్కారి. సరియైన పరిణామమూ తరీతాన్నీ చూసుకొంటే, మహావిప్లవవీరుడు. సత్సాధన, సత్ఫలితమూ రెంటినీకూడా, సజీవరూపంలో సమన్వయ మొనరించుకొంటూ, తనలో శివం చేసుకొని తత్స్వరూపంగానే గాంధీ నిలిచాడు.

గాంధిని అనేకమార్లు అనేకవిషయాల్లో, అపార్థాలు చేసుకొన్న పెక్కుమందిలో నేనొకడిని. బలవంతులూ, కల్మషులూ అయిన ధనికస్వాములయెడ సహనం చూపుతూ, వారికి కొన్ని ఊసులు బొట్లుకూడా కలిగిస్తున్నాడని ఆయన్ను అపార్థం చేసుకొన్నాను. కాని ఈ మాటు భారతదేశం వచ్చి చూచినపుడు, ఆయన ఎల్లప్పుడూ, పీడితులూ, అధఃపతితులూ అయిన వాళ్ళ పక్షమే అవలంబిస్తూ వచ్చాడని గ్రహించాను. ఆయన గత చర్యల నన్నిటినీ ఒక్కసారి సింహావలోకనం చేసుకొని చూస్తే, ప్రజల విస్తృత క్షేమాన్నభిలషించి తదనసరార్థమైచేసిన పట్ల తప్ప, ఆయన ఎప్పుడూ అధికారవర్గంతోటే, ధనికవర్గంతోటే—బ్రిటిష్ గానీ, భారతీయులు గానీ—ఎప్పుడూ లాలూచీ పడలేదని స్పష్టంగా తెలుస్తుంది. అనేకవైవిధ్యాలతోటే, అనేకవిశ్వాసాలతోటే, క్లిష్టతరమై ఉన్న భిన్నభిన్న సాంఘిక శక్తులకన్నిటికీకూడా, కేంద్రస్థానంలో నిలిచి, వాటిని అన్నిటిని కూడగట్టుకువచ్చి నడిపించవలసిన గురుతరమైన బాధ్యత వహించిన మహాజాతీయనాయకునిగా, గాంధీని అవగాహన చేసుకోగలిగితేతప్ప, ఆయన్ను సరిగ్గా అర్థం చేసుకోటం కష్టమవుతుంది. ఒకసారి ఆ జాతీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించగలిగాక, ఆయన తన వ్యక్తిత్వబలాన్నంతనూ, సర్వమానవజాతి సంస్కరణకూ, పునరుద్ధరణకూ అయిన అర్థ్య